సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం | 11 | ఆగస్టు | 2023



వెండి పంచాయుధాలు సమర్పణ

అన్నవరం: సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి శ్రీనివాస్ (హైదరాబాద్) రూ.లక్ష విలువ చేసే వెండి పంచాయుధాలు, వెండి చెంబును గురువారం అందజేశారు.



నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిత్యాన్నదాన భవన నిర్మాణానికి జీఎస్‌పీ ప్రసాద్, మాధవి దంపతులు (జగ్గంపేట) రూ.1,01,116 విరాళం అందించారు.

డెల్టాలకు 15 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం డెల్టా కాలువలకు 15 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,500 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.30 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

'నులి'మేద్దాం



విద్యార్థులతో అల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న డీఈవో కమలకుమారి

అమలాపురం టౌన్: కిశోర బాలల కడుపుల్లో నులి పురుగులు లేకుండా వాటిని సమూలంగా నులిమేద్దాం... ఆరోగ్య సమాజాన్ని ఆవిష్కరిద్దామని డీఈవో ఎం.కమలకుమారి పిలుపునిచ్చారు. అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో డీఈవో కమలకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాఠశాలలో చదువుతున్న దాదాపు 600 మంది విద్యార్థులకు డీఈవోతోపాటు డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ బి.పద్మశ్రీ రాణి, జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జాన్ లెవి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో సీహెచ్ భారతలక్ష్మి, విద్యాశాఖ సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, జిల్లా హెల్త్ కో ఆర్డినేటర్ బి.అనంతలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు బి.కామేశ్వరరావు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

పొగాకును నిర్మూలిద్దాం



విజేతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ దుర్గారావు దొర

అమలాపురం టౌన్: క్యాన్సర్, అల్సర్ వంటి ఎన్నో రోగాలకు కారకమవుతున్న పొగాకును పూర్తిగా నిర్మూలించే ప్రయత్నం అందరూ సమష్టిగా చేయాలని డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం జరిగిన అవగాహన సదస్సులో డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ దుర్గారావుదొర ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత విద్యార్థులకు పొగాకు వల్ల ఎదురయ్యే అనర్థాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ దుర్గారావు దొర ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పొగాకు, పొగాకు ఉత్పత్తులపై నిషేధం ఉన్న దృష్ట్యా వాటి వాడకం విషయంలో కూడా అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ సీహెచ్ భారతలక్ష్మి, జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జాన్ లెవి ప్రసంగిస్తూ పొగాకుతో రోగాలను కొని తెచ్చుకోవద్దని హితవు పలికారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. పొగాకు వ్యతిరేకంపై నిర్వహించిన వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీల విజేతలైన విద్యార్థులకు డీఎం అండ్ హెచ్ వో డాక్టర్ దుర్గారావు దొర ప్రశంసా పత్రాలు అందజేశారు.

స్రవంతికి 'విట్స్'లో ఉచిత సీటు



గుర్రం జ్యోతి స్రవంతి

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఇంటర్మీడియెట్ ఎంపీసీ బ్రాంచి చదివిన గుర్రం జ్యోతి స్రవంతి రెండో సంవత్సరం పరీక్షల్లో ప్రతిభ చాటి 1,000 మార్కులకు గాను 973 మార్కులు సాధించింది. దీంతో స్రవంతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల పరంగా ప్రథమ స్థానంలో నిలిచిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ కవల కోటిలింగం తెలిపారు. స్రవంతికి అమరావతిలోని విట్స్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా సీటు మంజూరు చేసిందన్నారు. స్రవంతి ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపినందుకు నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఆణి ముత్యాలు నగదు అవార్డులకు ఎంపికై ంది. నియోజకవర్గ స్థాయిలో రూ.10 వేలు, జిల్లా స్థాయిలో రూ.50 వేలు నగదు అవార్డులను మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా అందుకుంది. స్రవంతి తండ్రి గుర్రం వీరబాబు కౌలురైతు. తల్లి సరస్వతి గృహిణి. స్రవంతి తమ్ముడు లోకేష్ ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. సీఎస్ఈ చదివి ఇంజినీర్ కావాలన్నది స్రవంతి లక్ష్యం. తండ్రి వీరబాబు మాట్లాడుతూ తమది అయినవిల్లి మండలం కొండుకుదురు గ్రామమని, పిల్లల చదువుల కోసం అమలాపురం వచ్చి ఇక్కడే ఇల్లు అద్దెకు తీసుకుని జీవిస్తున్నామని అన్నారు. కౌలు రైతునైన తాను రోజూ అమలాపురం నుంచి కొండుకుదురు వ్యవసాయం చేస్తానని వీరబాబు తెలిపారు.

స్వావలంబనకు ఆలంబన

- అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు నింపేలా...
- నేడు వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ జమ
- జిల్లాలో 38,790 గ్రూపులకు రూ.52.88 కోట్లు
- నాలుగేళ్లలో 134.31 కోట్ల మేర పంపిణీ



కోనసీమలోని ఎస్‌హెచ్‌జీలు తయారు చేసిన వస్తువులు విక్రయిస్తున్న సంఘ సభ్యురాలు

సాక్షి అమలాపురం: మహిళలకు ఆర్థిక చేయూతనందిస్తే వారు స్వావలంబన సాధిస్తారని, సమాజం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని విశ్వసిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పలు ప్రభుత్వ పథకాల లబ్ధిని నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, ఆసరా వంటి పథకాలన్నీ మహిళల ఖాతాలోనే వేయడానికి అదే కారణం. దీనికి కొనసాగింపుగా మహిళా స్వయం శక్తి సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు ఏటా క్రమం తప్పకుండా సున్నా వడ్డీ రాయితీని ప్రభుత్వం వారి ఖాతాలలో జమ చేస్తోంది. శుక్రవారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి వారి ఖాతాలలో జమ చేయనున్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో ఆయన బటన్ నొక్కి మహిళల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న లబ్ధిదారులైన మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థికంగా బలోపేతం అయ్యేలా

మహిళా స్వయం శక్తి సంఘాల (ఎస్‌హెచ్‌జీ)లోని సభ్యులు తీసుకున్న రుణాలపై వడ్డీ భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీని అందిస్తోంది. దీనివల్ల జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలోని మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీ, 22 మండలాల పరిధిలోని 38,790 గ్రూపులకు రూ.52.88 కోట్ల సున్నా వడ్డీ రాయితీ అందనుంది. ఇప్పుడు అందుతున్న రాయితీతో కలిపి నాలుగేళ్ల కాలంలో ఇప్పటి వరకు 134.31 కోట్ల మేర సున్నా వడ్డీ రాయితీ రూపంలో లబ్ధి చేకూరింది. ఇది మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు దోహదపడుతోంది. ఒక్కొక్క సంఘం గరిష్ఠంగా రూ.20 లక్షల రుణం పొందుతోంది. వడ్డీ రాయితీ వల్ల ఒక్కొక్క ఎస్‌హెచ్‌జీ గ్రూపునకు రూ.11 వేల నుంచి రూ.24 వేల వరకు రాయితీగా వస్తోంది. వ్యాపారాలు నిర్వహిస్తున్న సంఘాలకు ఈ రాయితీ అక్కరకు వస్తోంది.

ఏటా పెరుగుతున్న సున్నా వడ్డీ రాయితీ

మహిళా సంఘాలకు అందిస్తున్న వడ్డీ రాయితీ ఏటా పెరుగుతోంది. 2019–20 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 33,422 గ్రూపులకు రూ.26.60 కోట్లు అందించారు. 2020–21లో 36,404 గ్రూపులకు రూ.24.23 కోట్లు, 2021–22లో 39,185 గ్రూపులకు రూ.30.59 కోట్లు ఇవ్వగా ఈ ఆర్థిక సంవత్సరంలో 38,790 గ్రూపులకు రూ.52.88 కోట్లు అందించారు. ఇప్పటివరకు సగటున 36,950 గ్రూపులకు రూ.134.31 కోట్లు అందించారు.

జిల్లాలో ఎస్‌హెచ్‌జీలకు అందేది ఇలా..

నియోజకవర్గం	లబ్ధి పొందే గ్రూపులు	కలిగే లబ్ధి	నాలుగేళ్లలో అందిన లబ్ధి (రూ.లలో)
అమలాపురం	6,010	8,04,35,000	20,64,46,000
కొత్తపేట	6,847	9,41,80,000	23,28,10,000
మండపేట	6,122	8,80,52,000	23,22,32,000
ముమ్మిడివరం	4,820	6,08,29,000	15,07,18,000
పి.గన్నవరం	3,985	5,87,66,000	20,06,01,000
రాజోలు	4,850	6,43,79,000	15,80,62,000
రామచంద్రపురం	3,958	5,87,66,000	16,22,41,000
మొత్తం	38,790	52,88,24,000	134,31,10,000

మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారు



ప్రభుత్వ ప్రోత్సాహంతో జిల్లాలోని ఎస్‌హెచ్‌జీలు, వాటిలోని సభ్యులు ఆర్థికంగా ఎంతో ఎదుగుతున్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి సున్నా వడ్డీ మంచి భరోసా ఇస్తోంది. మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ఈ ఏడాది ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఉమెన్ లెడ్ ఎంట్రర్‌ప్రైజెస్ (మహిళా పారిశ్రామిక వేత్తల)ను ప్రోత్సహించేందుకు పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ, కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు, ఖాదీ విలేజ్ ఇండస్ట్రియల్ బోర్డు రాయితీలతో కూడిన రుణాలు ఇస్తున్నాయి.

– డాక్టర్ వి.శివశంకర్‌ప్రసాద్, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ

సీఎం జగన్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

- ముస్తాబయిన స్టేడియం
- పోలీసు గ్రౌండ్‌లో హెలిప్యాడ్



సాక్షి అమలాపురం: అమలాపురం మండలం జనుపల్లి బాలయోగి స్టేడియంలో శుక్రవారం జరిగే కార్యక్రమంలో వేలాది మంది లబ్ధిదారుల సమక్షంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఏడాది సున్నా వడ్డీ రాయితీ పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. సీఎం జగన్ వారం రోజుల వ్యవధిలోనే కోనసీమ జిల్లాకు రావడం విశేషం. గోదావరి వరదల వల్ల నష్టపోయిన బాధితులను పరామర్శించేందుకు సీఎం మంగళవారం జిల్లాలోని ముమ్మిడివరం, పి.గన్నవరం నియోజకవర్గాలలో పర్యటించారు. ఈసారి ఎసున్నా వడ్డీ రాయితీని అందించేందుకు అమలాపురం నియోజకవర్గంలో పర్యటనకు వస్తున్నారు. ఆయన పర్యటన గత నెల 26వ తేదీన జరగాల్సి ఉంది. భారీ వర్షాలు కురవడంతో దీనిని 28వ తేదీకి వాయిదా వేశారు. వర్షాలు తగ్గకపోవడంతో రెండవసారి వాయిదా పడింది. గోదావరికి వరదలు రావడం, జిల్లా యంత్రాంగం సహాయ పునరావాస కార్యక్రమాలలో నిమగ్నం కావడంతో ఆలస్యమైంది.

సీఎం హోదాలో తొలిసారి

ముఖ్యమంత్రి హోదాలో వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అమలాపురం నియోజకవర్గానికి రావడం ఇదే తొలిసారి. కోనసీమ జిల్లా ఏర్పడిన తరువాత ఆయన ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాలలో పర్యటించారు. తొలిసారి వస్తున్నందున ఈ పర్యటనను విజయవంతం చేయాలని అటు జిల్లా యంత్రాంగం, ఇటు స్థానిక ప్రజాప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. భారీ వేదికను ఏర్పాటు చేయడంతో పాటు లక్ష మంది వచ్చినా సరిపోయేలా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు చేశారు. పోలీసులు ట్రాఫిక్ మళ్లించారు. సీఎం పర్యటన ఏర్పాట్లను మంత్రులు పినిపే విశ్వరూప్, ఆదిమూలం సురేష్, సీఎం కార్యక్రమాల కో–ఆర్డినేటర్ తలశిల రఘురామ్, ఎంపీ చింతా అనూరాధ, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణ రావు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ నపూర్ అజయ్, ఎస్పీ ఎస్.శ్రీధర్ పరిశీలించారు.

పర్యటన సాగుతుంది ఇలా..

- 9.30 గంటలకు తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు అమలాపురంలో ఉన్న పోలీస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు.
- 10.15 నుంచి 10.25 వరకు : అమలాపురం హెలిపాడ్ వద్ద స్థానిక ప్రజా ప్రతినిధులను కలుసుకుంటారు.
- 10.25 గంటలకు : హెలిపాడ్ నుంచి రోడ్డు మార్గంలో 10.40 గంటలకు అమలాపురం రూరల్ మండలం జనుపల్లి గ్రామం స్టేడియంలో ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకుంటారు.
- 10.40 నుంచి 10.55 వరకు : స్టాల్స్‌ను సందర్శించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం డ్వాక్రా మహిళలతో కలసి ఫొటో సెషన్‌లో పాల్గొంటారు.
- 11.00 నుంచి 11.15 వరకు : ప్రముఖులు మాట్లాడతారు
- 11.15 నుంచి 11.25 వరకు : లబ్ధిదారులతో మాటామంతీ
- 11.25 నుంచి 12.05 వరకు : సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రసంగం
- మధ్యాహ్నం : 12.05 నుంచి 12.10 వరకు : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని ప్రారంభిస్తారు.
- 12.20 గంటలకు : సభాస్థలం నుంచి బయలుదేరి 12.30 గంటలకు పోలీస్ గ్రౌండ్ వద్ద ఉన్న హెలిపాడ్‌కు చేరుకుంటారు.
- 12.30 నుంచి 1.00 గంట వరకు : స్థానిక నాయకులను కలుసుకుని చర్చిస్తారు.
- 1.05 గంటలకు : అమలాపురం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.
- 2.00 గంటలకు : తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

ఎఫ్‌పీఓల ద్వారా అధిక ధరలు



రైతులకు షేర్ బాండ్లు అందజేస్తున్న డీడీఎం స్వామినాయుడు, చైర్మన్ వేటుకూరి

కొత్తపేట: రైతులు పండించిన వ్యవసాయ, ఉద్యాన పంటల విక్రయం విషయంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీఓ) ద్వారా మార్కెట్‌కు ఎగుమతి చేసుకుని ఎక్కువ ధరలు పొందాలని నాబార్డు డీడీఎం స్వామినాయుడు సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం కేంద్రంగా ఏర్పాటు చేసిన బంగారు తల్లి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ సర్వసభ్య సమావేశం కొత్తపేట మండలం వానపల్లిలో గురువారం నిర్వహించారు. కంపెనీ చైర్మన్ వేటుకూరి సూర్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీడీఎం స్వామినాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డీడీఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలో 10 వేలు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చిందన్నారు. సీబీబీఓ (క్లస్టర్ బేస్ బిజినెస్ ఆర్గనైజేషన్) ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ప్రాంతంలో ఏ పంట అయితే ఎక్కువగా పండిస్తారో ఆ పంటని నేరుగా మార్కెట్‌కు చేరవేయడానికి మధ్యవర్తులు లేకుండా ఎక్కువ ధర వచ్చేలా కంపెనీ ఎగుమతి చేస్తుందన్నారు. దీనికి వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖలు సహకరిస్తాయన్నారు. రాబోయే రోజుల్లో ప్రతీ ఎఫ్‌పీఓ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఉత్పత్తుల విక్రయాలు జరుగుతాయన్నారు. కంపెనీ చైర్మన్ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ రైతు వ్యవసాయంతో పాటు వ్యాపారం చేసి, తను పండించిన పంటను కంపెనీ ద్వారా ఎక్కువ ధరకు విక్రయించి లాభం పొందాలన్న లక్ష్యంతో బంగారు తల్లి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేశామన్నారు. రాబోయే రోజుల్లో కోల్డ్ స్టోరేజ్, ఫెర్టిలైజర్ ఏర్పాటు చేసుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 200 ఎఫ్‌పీఓలు ఏర్పాటు చేసి చివరగా ఈ ప్రాంతంలో అరటి పంటకు సంబంధించి తగిన సంఘం లేదని గుర్తించి ఆ పంట ప్రాధాన్యతగా సంఘం ఏర్పాటుచేసినట్టు తెలిపారు. అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు క్లస్టర్ బేస్‌గా కంపెనీ తరఫున అందిస్తామన్నారు. కంపెనీకి షేర్ ధనం కట్టిన రైతులకు షేర్ బాండ్స్ పంపిణీ చేశారు. వానపల్లి దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, డైరెక్టర్లు గాదిరాజు ప్రసాదరాజు, ముత్యాల వెంకటేశ్వరరావు, సీఈఓ కాలబత్తుల చిన్నారి, బ్రెడ్స్ ప్రతినిధి అన్వేష్ పాల్గొన్నారు.

జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుదాం



మంత్రి వేణుకు జాతీయ పతాకాన్ని అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌కుమార్

రామచంద్రపురం: స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15న ప్రతీ ఒక్కరూ జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటి చెబుదామని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. రామచంద్రపురం సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎం.లక్ష్మణ్‌కుమార్ మంత్రి వేణుకు స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని జాతీయ పతాకాన్ని అందజేశారు. మంత్రి వేణు మాట్లాడుతూ జాతీయ భావాన్ని పెంపొందించుకునేందుకు ప్రతీ ఒక్కరూ జాతీయ పతాకాన్ని ఎగురవేయాలన్నారు. పోస్టాఫీసుల్లో జాతీయ పతాకాన్ని అందుబాటులో ఉంచుతున్నారని, సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని తపాలా కార్యాలయాల్లో జాతీయ పతాకాలను విక్రయిస్తున్నట్లు చెప్పారు.

కచ్చితత్వంతో ఓటర్ల జాబితా

కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ నుపూర్ అజయ్ తదితరులు

అమలాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కచ్చితత్వంతో కూడిన ఓటరు జాబితా అత్యంత అవసరమని, ఆ దిశగా ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా అమరావతి నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు డీఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇంటింటి సర్వే, బీఎల్‌ఓ రిజిస్టర్లు, బీఎల్‌ఓ యాప్ పనితీరు, తదితర వివిధ అంశాల పురోగతిపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజాస్వామ్య విశిష్టతను పెంపొందించే చర్యల్లో భాగంగా ఓటర్ల జాబితా అత్యంత నాణ్యత ప్రమాణాలతో రూపొందించాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణలో భాగంగా అనర్హులను మరణించిన వారి, వలసలు వెళ్లినవారి ఓట్లను నిర్దేశిత ప్రొసీజర్ ప్రకారం నోటీసులు జారీ చేస్తూ తొలగింపులు చేపట్టాలన్నారు. ఇంటింటి సర్వేను ఈ నెల 21 నాటికి పూర్తి చేసి నివేదికలను యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తూ దోషరహిత జాబితాను రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో 5,22,090 గృహాలు ఉండగా వీటిలో 1,06,695 గృహాలను బీఎల్‌ఓ యాప్ ప్రకారం సర్వే జరిగిందన్నారు. జిల్లాలో 2,47,351 గృహాల సర్వే పూర్తి చేయడం ద్వారా 47శాతం ఇంటింటి సర్వే భౌతికంగా పూర్తయిందని తెలిపారు. ఫారం–6 ద్వారా కొత్తగా ఓటుహక్కు కల్పనకు, ఫారం–7 ద్వారా డూప్లికేటింగ్ ఓట్లు, శాశ్వతంగా వలసలు వెళ్లిపోయిన వారి పేర్లను తొలగించాలని, ఫారం 8 మార్పులు చేపట్టాలన్నారు. జిల్లాలో ఒకే కుటుంబంలో పదిమంది పైబడి ఓటర్లు కలిగిన కుటుంబాలు 5,532 వరకు ఉన్నాయన్నారు. 100 సంవత్సరాలు వయసు పైబడిన ఓటర్లు 105 మంది వరకు కోనసీమ జిల్లాలో ఉన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు ఎన్నికల జాబితా రూపకల్పన ఉద్యోగులు పాల్గొన్నారు.

బియ్యం కార్డులొచ్చేశాయ్..

- జిల్లాలో 7,714 మందికి మంజూరు
- సచివాలయాల్లో లబ్ధిదారులకు అందజేత
- వచ్చే నెల నుంచే రేషన్ సరకుల పంపిణీ



బియ్యం కార్డులు



లబ్ధిదారులకు బియ్యం అందజేస్తున్న సిబ్బంది

రాయవరం: టీడీపీ ప్రభుత్వ హయాంలో బియ్యం కార్డు పొందాలంటే సవాలక్ష నిబంధనలు ఉండేవన్న విమర్శలు ఉన్నాయి. అర్హతలున్నప్పటికీ జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేది. సచివాలయ వ్యవస్థతో ఇప్పుడంతా మారిపోయింది. అర్హత ఉండి, వలంటీర్‌కు దరఖాస్తు ఇస్తే వెంటనే కార్డు మంజూరు అవుతున్న పరిస్థితి ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉంది. రేషన్‌కార్డు మంజూరైన నెలలోనే రేషన్ సరకులు కూడా లబ్ధిదారులకు అందజేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాల్లోని అర్హులైన లబ్ధిదారులకు 7,714 బియ్యం కార్డులు కొత్తగా మంజూరయ్యాయి.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని పేరు తెచ్చుకున్నారు. గతంలో మాదిరిగా కాకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బియ్యం కార్డుల మంజూరు ప్రక్రియ సులభతరం అయింది. వలంటీర్లు ఇంటింటికీ తిరిగి అర్హులను గుర్తించి దరఖాస్తు చేయిస్తున్నారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారుల నుంచి తీసుకుని వారే సచివాలయాల్లో అందిస్తూ కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయిస్తున్నారు.

అర్హతే ప్రామాణికం

గత నెలలో జిల్లా వ్యాప్తంగా 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. బియ్యం కార్డుల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. అర్హులను గుర్తించి 7,714 కుటుంబాలకు కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేశారు. అలాగే రేషన్ కార్డులు మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో కొత్తగా వివాహం చేసుకున్న దంపతులు, ఉమ్మడి కుటుంబాల నుంచి విడిపోయి వేరు కాపురం పెట్టిన వారు దరఖాస్తు చేయగానే కొత్త రేషన్ కార్డు మంజూరు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని 22 మండలాల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 5,44,933 మంది కుటుంబాలకు బియ్యం కార్డులున్నాయి. ఈ కార్డుదారుల కుటుంబాల్లో 15,40,757 మంది కుటుంబ సభ్యులున్నారు. జిల్లాలో అంత్యోదయ కార్డులు 24,797 ఉండగా, తెలుపురంగు కార్డుదారులు 5,20,136 మంది ఉన్నారు. ఈ కార్డుల ద్వారా ప్రతి నెలా 7,692 మెట్రిక్ టన్నుల బియ్యం ఉచితంగా అందజేస్తున్నారు. సబ్సిడీ ధరపై పంచదార, కందిపప్పు, రాగులు, పట్టణ ప్రాంతాల్లో గోధుమ పిండి తదితర సరకులను ఎండీయూ వాహనాల ద్వారా లబ్ధిదారుల ఇంటికే అందజేస్తున్నారు.

వచ్చే నెల నుంచి పంపిణీ

కొత్త బియ్యం కార్డులను ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా వలంటీర్లను లబ్ధిదారుల ఇళ్లకు పంపి కార్డు అందించడం, లేదా సచివాలయాలకు పిలిపించి ఇస్తున్నారు. లబ్ధిదారు సచివాలయానికి వెళ్లగానే కార్డు ప్రింట్ తీసి వెంటనే అందజేస్తున్నారు. కొత్త కార్డులకు వచ్చే నెలలో పంపిణీ చేయడానికి అవసరమైన బియ్యం, రాగులు, చక్కెర, కందిపప్పును అధికారులు ఇండెంట్ పెడుతున్నారు. జిల్లాలో 926 చౌక ధరల దుకాణాలుండగా, ఇంటి వద్దనే బియ్యం అందించేందుకు 355 ఎండీయూ వాహనాలు అందుబాటులో ఉన్నాయి.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ..



ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ బియ్యం కార్డు అందిస్తోంది. ప్రభుత్వం నిర్ణయం మేరకు కొత్తగా మంజూరైన బియ్యం కార్డులకు రేషన్ సరకులు అందజేస్తాం.

– ఎ.పాపారావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, అమలాపురం

జిల్లాలో బియ్యం కార్డుల మంజూరు ఇలా..

మండలం	మంజూరైన కార్డులు
అయినవిల్లి	230
ఆలమూరు	274
అల్లవరం	261
అమలాపురం	605
అంబాజీపేట	263
ఆత్రేయపురం	256
ఐ.పోలవరం	277
కపిలేశ్వరపురం	333
కాట్రేనికోన	535
కొత్తపేట	253
మలికిపురం	317
మామిడికుదురు	384
మండపేట	538
ముమ్మిడివరం	309
కె.గంగవరం	253
రామచంద్రపురం	450
రావులపాలెం	464
రాయవరం	403
రాజోలు	274
సఖినేటిపల్లి	408
ఉప్పలగుప్తం	310

సత్యదేవుని మాడ వీధులకు మార్కింగ్

- 60 అడుగుల వెడల్పున నాలుగు వైపులా నిర్మాణం
- తిరుమల మాదిరిగా ప్లాన్
- విశ్రాంతి షెడ్డు మధ్యలో నుంచి వీధి





అన్నవరం దేవస్థానం

అన్నవరం: రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి ఆలయానికి నలుదిక్కులా విశాలమైన మాడ వీధుల నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఆలయానికి నాలుగు వైపులా మాడ వీధులు వచ్చే స్థలాన్ని గుర్తించి మార్కింగ్ చేశారు. ఇటీవల వచ్చిన దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు, కమిషనర్ ఎస్.సత్యనారాయణకు ఈ మాడ వీధుల మార్కింగ్ చూపించామని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. దేవస్థానం చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఆలయానికి నాలుగు వైపులా రథయాత్ర నిర్వహించేందుకు వీలుగా నాలుగు విశాలమైన మాడ వీధుల నిర్మాణానికి రంగం సిద్ధమవుతోంది. తిరుమల వేంకటేశ్వరుని ఆలయానికి నాలుగు వైపులా మాడ వీధులున్నట్టుగానే సత్యదేవుని ఆలయానికి నలువైపులా 60 అడుగుల వెడల్పున మాడ వీధుల నిర్మాణానికి ప్లాన్ రూపొందించారు. దీంతో ఇరుకుగా ఉన్న ఆలయ ప్రాంగణం మరింత విశాలం కానుంది.

నిర్మాణం ఇలా..

- సత్యదేవుని ఆలయం చుట్టూ నాలుగు మాడ వీధులు 60 అడుగుల వెడల్పున, ఈశాన్యం, తూర్పు ఎక్కువగా ఉండేలా నిర్మించనున్నారు. ఈ మేరకు మార్కింగ్ చేశారు.
- **తూర్పు నుంచి దక్షిణం, పడమరకు:** ఈఓ కార్యాలయం ఎదురుగా గల పార్కింగ్ స్థలం నుంచి సర్క్యులర్ మంటపం మీదుగా విశ్రాంతి షెడ్డు మధ్యలో నుంచి రామాలయం తాకుతూ ప్రసాద తయారీ భవనం పక్క నుంచి 30 వీఐపీ సత్రం రోడ్డుకు

పడమర నుంచి ఉత్తరానికి: 30 వీఐపీ సత్రం నుంచి కేశఖండనశాల దిగువన గల ఘాట్‌రోడ్డు వరకు

> **ఇది ప్రాథమిక అంచనా మాత్రమే**
> మాడ వీధులకు మార్కింగ్ అంచనా కోసం మాత్రమే. దీనిని ఇంకా విపులంగా అందరితో చర్చించి ఫైనల్ చేస్తాం. సాధ్యమైనంత వరకూ నిర్మాణాలు ఏమీ పోకుండా చూస్తాం.
> – చంద్రశేఖర్ అజాద్, ఈఓ, రత్నగిరి దేవస్థానం

ఉత్తరం నుంచి తూర్పునకు

- ఘాట్ రోడ్డు మీదుగా ఆయుష్యహోమ మంటపం దిగువ నుంచి ఈఓ కార్యాలయం ముందు గల పార్కింగ్ స్థలం వరకు
- ఈ నాలుగు మాడ వీధులకు మార్కింగ్ ఇచ్చారు.



సత్యదేవుని ఆలయానికి నాలుగు వైపులా రానున్న మాడ వీధుల ప్లాన్



విశ్రాంతి షెడ్డు మధ్యలో నుంచి మాడ వీధికి మార్కింగ్

రామాలయం ఫ్లోరింగ్‌కు సమానంగా ఈ వీధులు నిర్మిస్తారు. 30 వీఐపీ వద్ద 33 అడుగులు లోతుకు తవ్వుతారు. కేశఖండన శాల దిగువన ఘాట్‌రోడ్డును 30 అడుగులు ఎత్తు చేస్తారు. ఈ రోడ్లకు మధ్య స్థలాన్ని కూడా ఎత్తు చేస్తారు. విశాలమైన రథం ఈ రోడ్డు ద్వారా తిరిగేలా, సుమారు పది వేల మంది భక్తులు ప్రదక్షిణ చేసేలా వీధులు నిర్మిస్తారు.

క్లుప్తంగా

యువకుడి హత్య కేసులో నిందితుల అరెస్ట్



విలేకరులతో మాట్లాడుతున్న ప్రత్తిపాడు సీఐ కె.కిశోర్‌బాబు, అన్నవరం ఎస్సై వి.కిశోర్

శంఖవరం: మండలంలోని కొంతంగి గ్రామంలో యువకుడిని హత్య చేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు అన్నవరం పోలీసులు తెలిపారు. ప్రత్తిపాడు సీఐ కె.కిశోర్‌బాబు అన్నవరం పోలీస్ స్టేషన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామానికి చెందిన పగడం దుర్గాప్రసాద్‌ను ప్రియురాలు గ్రంధి దుర్గా భవాని ఈ నెల 7వ తేదీన చున్నితో ఉరి వేసి హత్య చేసింది. తల్లిదండ్రులు, సోదరుడు సహకరించి మృతదేహాన్ని దుర్గాభవాని అద్దె ఇంట్లో పడవేశారని తెలిపారు. గురువారం ఉదయం నిందితులు నలుగురు పంచాయతీ కార్యదర్శి సమక్షంలో లొంగిపోయినట్లు తెలిపారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. సమావేశంలో అన్నవరం ఎస్సై వి.కిశోర్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

కడియం: మండలంలోని వీరవరంలోని ఒక షెడ్డులో 17 ప్లాస్టిక్ బ్యాగుల్లో నిల్వ చేసిన సుమారు వేయి కేజీల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఆలమూరు మండలం అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామానికి చెందిన ఎస్.అర్జున్, వీరవరం చుట్టుపక్కల గ్రామాల్లోని కార్డుదారుల నుంచి ఈ బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసినట్లు గుర్తించారు. బియ్యంతో పాటు ఆటో, ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్‌లను సీజ్ చేశారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది వీరబాబు, లోవకుమార్, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు ఈ దాడుల్లో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా కర్రి పద్మశ్రీ



కాకినాడ: గవర్నర్ ఆమోదంతో శాసనమండలి సభ్యురాలిగా కర్రి పద్మశ్రీని ఖరారు చేస్తూ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నర్ కోటాలో ఆమెను ఈ పదవికి ఎంపిక చేశారు. ఆరేళ్ల పాటు ఎమ్మెల్సీగా కొనసాగనున్నారు. ప్రస్తుతం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కొనసాగుతున్న చడిపిరాళ్ళ శివనాథ్‌రెడ్డి, ఎన్ఎండి ఫరూఖ్ పదవీకాలం జూలై 20తో పూర్తికావడంతో కొత్త ఎమ్మెల్సీలను ప్రభుత్వం సిఫార్సు చేసింది. వాడబలిజ మత్స్యకార వర్గానికి చెందిన కర్రి పద్మశ్రీని ఎమ్మెల్సీగా ఖరారు చేస్తూ ఉత్తర్వులు వెలువడడంతో స్థానికంగా ఆమెను పలువురు నాయకులు, కార్యకర్తలు, వాడబలిజ మత్స్యకార ప్రతినిధులు అభినందించారు. ఆమెను సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి అభినందించారు.

సాంస్కృతిక పరిరక్షణకు నృత్య ప్రదర్శనలు

- నేటి నుంచి సంపూర్ణ భారత యాత్ర
- 22 రాష్ట్రాలలో పురాతన దేవాలయాలలో కూచిపూడి నృత్యాభినయం
- 63 రోజుల పాటు నిర్విరామ ప్రదర్శన
- శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర నిర్వాహకుడు డాక్టర్ జీబీ నారాయణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సనాతన ధర్మం, సాంస్కృతిక సంపద పరిరక్షణ కోసం దేశంలోని పురాతన దేవాలయాలలో నృత్యాభినయం నిర్వహిస్తామని శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర నిర్వాహకుడు డాక్టర్ జీబీ నారాయణ అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని సంస్థ కార్యాలయంలో యాత్రకి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శ్రీరాధాకృష్ణ కళాక్షేత్రం, శ్రీరాధాకృష్ణ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ఈ యాత్రను అయినవిల్లిలో ప్రారంభిస్తామన్నారు. అక్టోబర్ 12వరకు 63రోజులపాటు 22 రాష్ట్రాల మీదుగా యాత్ర కొనసాగుతుందన్నారు. వివిధ రాష్ట్రాల్లోని ఆలయాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తూ 17 వేల కిలోమీటర్ల పొడవునా యాత్ర ఉంటుందన్నారు. మరుగున పడుతున్న కూచిపూడి నాట్యానికి నూతన ఉత్తేజం తీసుకుని రావడానికి ఈ యాత్ర చేస్తున్నామన్నారు. ఒడిశా, పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల మీదుగా యాత్ర ఉంటుందన్నారు. ఆయా రాష్ట్రాల్లో కేంద్ర మంత్రులకు ముందుగా వర్తమానం పంపించి ప్రదర్శనలు ఇస్తామని తెలిపారు. మినీ బస్సులో తామంతా వెళుతున్నామని, అలాగే ఏ రాష్ట్రం రావాలని ఆసక్తి ఉంటె నేరుగా పిల్లలను తీసుకుని తల్లిదండ్రులు అక్కడకు వచ్చి ప్రదర్శనలు ఇస్తారని డాక్టర్ నారాయణ చెప్పారు. శృంగేరి, కంచి తదితర పీఠాధిపతులు, స్వామీజీల ఆశీస్సులు యాత్రకు ఉన్నాయని ఆయన తెలిపారు. నర్మద, భారత్ యాత్ర టీమ్ లీడర్ జి.లక్ష్మీ దీపిక, శృతి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీబీ నారాయణ తదితరులు

ఓపీఎస్ అమలు చేయాలని రైల్వే ఉద్యోగుల ధర్నా

సామర్లకోట: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైల్వే ఉద్యోగులు, కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. స్థానిక సెక్షన్ ఇంజినీరు కార్యాలయం వద్ద ఈ ధర్నా నిర్వహించారు. కొత్త పెన్షన్ విధానం వలన ఉద్యోగులు పదవీ విరమణ చేసిన తరువాత భరోసా లేకుండా పోతోందని స్థానిక బ్రాంచి కార్యదర్శి ఎం.రమేష్ అన్నారు. ప్రస్తుత బేసిక్ పే మీద బోనసు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా అన్ని రైల్వే కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి తమ డిమాండ్‌లను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తున్నామన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు రామసుబ్బారావు, మోహన్‌రావు, బ్రాంచి చైర్మన్ టి.ఈశ్వరరావు, వర్కింగ్ చైర్మన్ రామకృష్ణ, వైస్ చైర్మన్‌లు పి. త్రినాథ్, గోపాలరెడ్డి, సహాయ కార్యదర్శులు సత్యనారాయణ, విశ్వప్రసాద్, బ్రాంచి ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, రైల్వే ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



సామర్లకోటలో ధర్నా నిర్వహించిన రైల్వే ఉద్యోగులు

నేడు, రేపు మహా జాబ్‌మేళా

కొత్తపేట: రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల (అటానమస్)లో ఈ నెల 11, 12 తేదీల్లో మహా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు నిర్వహించే ఈ జాబ్‌మేళాకు 500 కంపెనీలు వస్తుండగా సుమారు 30 వేల ఉద్యోగాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లా పరిధిలోని 4 నోడల్ రిసోర్స్ సెంటర్ల (ఎన్ఆర్‌సీ) కళాశాలల పరిధిలోని 40 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2022-23 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన విద్యార్థులకు ఈ జాబ్‌మేళాలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. శుక్రవారం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల, తాడేపల్లిగూడెం ప్రభుత్వ కళాశాల పరిధిలోని 20 కళాశాలల విద్యార్థులకు, శనివారం కాకినాడ పీఆర్ కళాశాల, తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిధిలోని 20 కళాశాలల విద్యార్థులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మహా జాబ్‌మేళాకు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులు ఐడీ కార్డు, యూనిఫామ్, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, రెజ్యూమ్, ఆధార్‌కార్డుతో పాటు అకడమిక్ సర్టిఫికెట్స్ 3 సెట్లు జిరాక్స్ కాపీలతో తీసుకు రావాలని సూచించారు. ఈ జాబ్‌మేళాకు వెళ్లే అభ్యర్థులకు రవాణా, భోజన సదుపాయాలు కళాశాల తరపున కల్పిస్తున్నామని తెలిపారు. కొత్తపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి శనివారం 127 మంది విద్యార్థులను రెండు బస్సుల్లో తీసుకువెళ్తున్నట్టు ప్రిన్సిపాల్ కేపీ రాజు తెలిపారు.

సత్యదేవుని హుండీ ఆదాయం రూ.2.28 కోట్లు



సత్యదేవుని హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

- 50 రోజులకు రికార్డు స్థాయి ఆదాయం
- ఆషాఢం, అధిక శ్రావణ మాసాలలో భక్తులు తగ్గినా గణనీయంగా రాబడి
- సరాసరిన రోజుకు రూ.4.56 లక్షలు

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి హుండీల ద్వారా 50 రోజులకు గాను రికార్డు స్థాయిలో రూ.2,28,40,146 ఆదాయం సమకూరింది. దేవస్థానంలో హుండీలను గురువారం తెరిచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించినట్లు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. దీంతోబాటు బంగారం 181 గ్రాములు, వెండి 290 గ్రాములు వచ్చినట్లు వివరించారు. ఆదాయంలో నగదు 2,19,96,456, చిల్లర నాణేలు 8,43,690 లభించినట్లు తెలిపారు. విదేశీ కరెన్సీ కూడా పెద్ద మొత్తంలో లభించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దీరామ్స్ 20, కెనడా డాలర్లు పది, అమెరికా డాలర్లు 1,525, ఇంగ్లాండ్ పౌండ్లు 20, కువైట్ దీనార్లు 21.5, బ్రెజిల్ రియల్స్ వంద, బెహరిన్ దీనార్లు రెండు, ఒమెన్ రియల్స్ రెండు, శ్రీలంక రూపాయలు 5,620, ఖతార్ రియల్స్ 14, యూరోలు 150, సింగపూర్ డాలర్లు ఏడు లభించాయి.

దేవస్థానం ఏసీ రమేష్ బాబు, జిల్లా దేవదాయశాఖ అధికారి పి.నారాయణమూర్తి, ఎంఎం వీరభద్రరావు, దేవస్థానం సిబ్బంది, పురోహితులు, నాయీ బ్రాహ్మణులు, స్వచ్ఛంద సేవల సిబ్బంది హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

శ్రావణంలో ఆదాయం పెరుగుతుందని అంచనా

ఈసారి హుండీ ఆదాయం జ్యేష్ఠమాసం 30 రోజులు, అధిక శ్రావణం 20 రోజులు మొత్తం 50 రోజుల ఆదాయం. ఈ రెండు కూడా శుభకార్యాలు జరగని మాసాలు. దాంతో సత్యదేవుని ఆలయానికి దశమి, ఏకాదశి, శని, ఆదివారాలు మినహా మిగిలిన రోజుల్లో పెద్దగా భక్తులు రాలేదు. అయినప్పటికీ హుండీ ఆదాయంలో పెద్దగా తగ్గుదల కనిపించలేదు. సరాసరిన రోజుకు రూ. 4.56 లక్షలు చొప్పున ఆదాయం సమకూరింది. ఈ నెల 17వ తేదీ నుంచి శ్రావణమాసం ప్రారంభమవుతుండడంతో స్వామివారి సన్నిధిన పెద్ద సంఖ్యలో వివాహాది శుభకార్యాలు జరగనున్నాయి. సత్యదేవుని దర్శించేందుకు వేలసంఖ్యలో భక్తులు విచ్చేయనున్నారు. దీంతో స్వామివారి హుండీ ఆదాయం రికార్డు స్థాయిలో వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

కుక్కల దాడిలో కణుజు మృతి


గోకవరం: మండలంలోని కామరాజుపేట పంచాయతీ పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో జనావాసంలోకి వచ్చిన ఓ కణుజు (కొపింగ) కుక్కల దాడిలో గాయపడి మృతి చెందింది. వివరాల ప్రకారం సూదికొండ అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న జగన్నాథపురం గ్రామంలోకి గురువారం సాయంత్రం ఓ కణుజు దారి తప్పి వచ్చింది. ఈ కణుజుని గుర్తించిన కుక్కలు తరమడంతో పాటు గాయపరిచాయి. కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన కణుజు మృతి చెందింది. విషయాన్ని స్థానికులు అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో అటవీశాఖ అధికారులు గ్రామానికి చేరుకుని కణుజుకు పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు.

ఉపాధి కూలీ దుర్మరణం

పిఠాపురం: మండలంలోని విరవాడలో గురువారం ఉపాధి కూలీ మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం విరవాడకు చెందిన కడాలి వీర్రాజు ఉపాధి హామీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం యథావిధిగా ఉపాధి పనులకు వెళ్లిన వీర్రాజు పని చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. సహచర కూలీలు ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు.

వివాహిత, యువకుడు ఆత్మహత్యాయత్నం

- జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆమె మృతి
- అతడి పరిస్థితి అత్యంత విషమం



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శ్రీదేవి, అరుణ్‌కుమార్

కాకినాడ రూరల్/కాకినాడ క్రైం: స్థానిక సూర్యారావుపేట బీచ్‌లో గురువారం ఉదయం 11 గంటల సమయంలో గడ్డి మందుతాగి వివాహిత, యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్నవారిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తిమ్మాపురం పోలీసుల కథనం ప్రకారం.. ప్రత్తిపాడు మండలం పోతులూరుకు చెందిన 21 ఏళ్ల మువ్వల అరుణ్‌కుమార్, అదే గ్రామానికి చెందిన వివాహిత 27 ఏళ్ల వల్లు శ్రీలక్ష్మి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ధర్మవరానికి చెందిన శ్రీలక్ష్మికి ఐదేళ్ల క్రితం పోతులూరుకు చెందిన వ్యక్తితో వివాహం అయ్యింది. అత్తింటి వద్దే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన మువ్వల అరుణ్‌కుమార్ ఐటీఐ చదివి హైదరాబాద్‌లో ప్రైవేటుగా పని చేస్తున్నాడు. గత మంగళవారం ఇంటి నుంచి శ్రీలక్ష్మి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అరుణ్‌కుమార్ కూడా ఆ రోజే హైదరాబాద్ వెళ్తున్నట్టు చెప్పి సెల్ స్విచ్ ఆఫ్ చేసి కనిపించలేదు. ఇద్దరూ విజయవాడ, పరిసర ప్రాంతాల్లో తిరిగి గురువారం కాకినాడకు చేరుకుని బీచ్‌లో ముళ్లపొదల వద్ద అధికంగా గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శ్రీదేవి రాత్రి మృతి చెందింది. అరుణ్‌కుమార్ పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. పొరుగున ఉండే వారిద్దరూ అక్కాతమ్ముడంటూ పిలుచుకునేవారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ ఘటనపై సర్పవరం పోలీసులు కేసు నమోదు చేసినట్టు ఎస్సై నాగార్జునరాజు తెలిపారు.


సంక్షేమ రధసారథికి
స్వాగతం.. సుస్వాగతం...
మన రాష్ట్రంలో ఉన్న
డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు
సున్నా వడ్డీ కార్యక్రమం
నేడు డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
అమలాపురంలో జరుగు కార్యక్రమానికి విచ్చేయుచున్న
మన రాష్ట్ర అభివృద్ధి ప్రదాత,
సంక్షేమ రధసారథి, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి,
మన ముఖ్యమంత్రివర్యులు
గౌ॥ శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గార్కి
ఇవే మా స్వాగత సుమాంజలులు
సభా స్థల వేదిక:
బాలయోగి ఘాట్ గ్రౌండ్, నల్ల వంతెన, అమలాపురం
గౌ॥ శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు
ముఖ్యమంత్రివర్యులు, ఆంధ్రప్రదేశ్
పినిపే విశ్వరూప్
రాష్ట్ర రవాణా శాఖా మంత్రి

క్లుప్తంగా

అన్నదాన ట్రస్టుకు విరాళం



అన్నదాన ట్రస్టుకు విరాళం అందజేస్తున్న దాత ఇందుకూరి వెంకట్రాజు దంపతులు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు కేశనకుర్రు గ్రామానికి చెందిన ఇందుకూరి వెంకట్రాజు దంపతులు రూ.11,120 విరాళాన్ని ఆలయ పర్యవేక్షణాధికారి బి.వీరభద్రరావుకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేసి ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.

తహసీల్దార్‌కు అభినందనలు

తాళ్లరేవు: రాష్ట్ర రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఎంపికైన తహసీల్దార్ ఎస్.పోతురాజుకు పలువురు అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కాశి లక్ష్మణస్వామి, కె.చందు, పెయ్యల శ్రీనివాస్ తదితరులు ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు.

120 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్



మద్యం సీసాలతో పట్టుబడ్డ నిందితుడు మురళీకృష్ణతో ఎస్ఈబీ పోలీసులు

తాళ్లరేవు: యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి ద్విచక్ర వాహనంపై మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ జేవీ భవాని తెలిపారు. సుంకరపాలెం వద్ద నిర్వహించిన దాడుల్లో యానాం మెట్టకుర్రు గ్రామానికి చెందిన వడ్డి మురళీకృష్ణ 120 మద్యం సీసాలను తరలిస్తుండగా పట్టుకుని అరెస్ట్ చేశామన్నారు. అతడి నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్ఐ ఎంవీవీబీ కుమార్, హెడ్ కానిస్టేబుల్ డీవీ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు కేవీ భద్రరావు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

ఉప్పలగుప్తం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ అన్నారు. గురువారం గొల్లవిల్లి గ్రామంలో ఉన్న నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులకు సర్పంచ్ శ్రీదుర్గ గురువారం అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జొన్నాడ చిన్ని, పంచాయతీ కార్యదర్శి పరమట సాయిబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగుల వితరణ

అమలాపురం టౌన్: తోటి దివ్యాంగుడు మృతి చెందడంతో దివ్యాంగుల సంఘం ప్రతినిధులు ఆ నిరుపేద కుటుంబానికి తమ వంతు సాయంగా రూ.5 వేలు వితరణగా అందించారు. అయినవిల్లి మండలం విలస గ్రామానికి చెందిన జిల్లా దివ్యాంగుల హక్కుల వేదిక ఉపాధ్యక్షుడు లక్కవరపు ఏసురత్నం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. నగదును విలసలోని బాధిత కుటుంబ సభ్యులకు గురువారం అందజేసినట్లుగా జిల్లా దివ్యాంగ ఐక్య జేఏసీ చైర్మన్ పెనుమాల నాగరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

విష్ణుమూర్తి, పవన్‌లకు సత్కారం



విష్ణుమూర్తి, పవన్‌లను సత్కరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇటీవల ఢిల్లీలో భారత్‌కి అన్మోల్–2023 జాతీయ అవార్డు స్వీకరించిన మాజీ మున్సిపల్ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి, ఆయన కుమారుడు నల్లా పవన్‌లను ది చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సత్కరించారు. గురువారం స్థానిక కొల్లూరివారి సత్రంలో చాంబర్ అధ్యక్షుడు బోణం సత్తిబాబు అధ్యక్షతన అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో చాంబర్ గౌరవాధ్యక్షుడు అల్లాడి స్వామినాయుడు, గౌరవ కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు తదితరులు ప్రసంగించారు.

ఆటపాటలతో బోధన

- అంగన్‌వాడీల్లో జన భాగీధారికి శ్రీకారం
- అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం



అంగన్‌వాడీలో జన భాగీధారి విధానంలో చేస్తున్న విద్యాబోధన

ముమ్మిడివరం: చిన్నారుల జీవితంలో మొదటి ఆరేళ్లు ఎంతో విలువైనవి. మూడేళ్ల వరకూ తల్లి ఒడికే పరిమితమయ్యే పిల్లలు తరువాత బయట ప్రపంచాన్ని అర్థం చేసుకునే ప్రయత్నాలు మొదలుపెడతారు. ఈ వయసులో చూపిన, విన్న అంశాల ఆధారంగా చిన్నారులు తమ బుద్ధిని, తెలివితేటలను వికసింపజేసుకుంటారు. అందుకే అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను చిన్నారులకు ఇష్టమైన ఆట, పాట, కథల ద్వారా వారి మనసులు హత్తుకునేలా బోధించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ఈ విధమైన విద్యా ప్రభావం పిల్లల్లో ప్రాథమిక స్థాయిలోనే కాకుండా ఉన్నత స్థాయిలోనూ విద్యా ప్రమాణాలను అందించేందుకు దోహదపడుతుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఇష్టమైన విధంగా బోధన చేసేందుకు జన భాగీధారి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్క్‌బుక్స్, ఆక్టివిటీ బుక్స్, స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాల ద్వారా పిల్లలకు ఆటపాటలతో విద్యను ఎలా అందిస్తున్నారో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

ముమ్మిడివరం ప్రాజెక్టు పరిధిలో కేంద్రాలు...

ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 252 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో మెయిన్ కేంద్రాలు 241 కాగా, 11 మినీ కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో చిన్నారులను ఆకర్షించేందుకు జన భాగీధారి కార్యక్రమం ప్రవేశపెట్టి ఆటపాటలతో బోధన సాగిస్తున్నారు. ప్రతి పాఠాన్ని ఏదొక ఆట, పాటల్లో మిళితం చేసి నేర్పిస్తుండడంతో చిన్నారుల్లో ఆసక్తి ఏర్పడుతుంది. చిన్నారుల వ్యక్తిత్వ మనో వికాసం పెంపొందించడం కోసం పలు ఆటలు ఆడిస్తున్నారు. ఈ విధానం ఎంతో బాగుందన్న ప్రశంసలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలు, విద్యాబోధనపై ప్రతిఒక్కరూ అవగాహన చేసుకుని చిన్నారులను కేంద్రాలకు పంపించే విధంగా సహకారం అందించాలని కోరుతున్నారు.

తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకొస్తున్నాం



చిన్నారుల మనసులు హత్తుకునేలా అంగన్‌వాడీల్లో ఆటపాటల ద్వారా విద్యను నేర్పిస్తున్నాం. జన భాగీధారి కార్యక్రమంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాల్సిన ఆవశ్యకతను వివరించి చైతన్యం తీసుకొస్తున్నాం.

– వరసాల మంగాదేవి, అంగన్‌వాడీ టీచర్, గాడిలంక

జన భాగీధారి మంచి ఫలితాలనిస్తోంది



ఆరేళ్ల లోపు చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసేలా చేపట్టిన జన భాగీధారి మంచి ఫలితాలనిస్తుంది. ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆటపాటలంటే ఎంతో నచ్చుతాయి. అలా ఆటపాటల ద్వారానే విద్యను మిళితం చేసి నేర్పిస్తున్నాం. జన భాగీధారి కార్యక్రమంపై అందరి నుంచి ప్రశంసలు వస్తున్నాయి.

– ఐ.విమల, ఇన్‌చార్జ్ సీడీపీఓ, ముమ్మిడివరం



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రులు సురేష్, విశ్వరూప్ తదితరులు

తండ్రిని మించిన తనయుడు సీఎం జగన్

మంత్రి ఆదిమూలపు సురేష్

అమలాపురం రూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పావలా వడ్డీకే డ్వాక్రా సంఘాలకు రుణాలు అందిస్తే ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి సున్నా వడ్డీకే రుణాల అందించి గొప్ప సంపదను సృష్టిస్తున్నారని రాష్ట్ర పురపాలన పట్టణాభివృద్ధి శాఖల మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. గురువారం రాత్రి ఆయన జీఎంసీ బాలయోగి స్టేడియంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌తో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి శుక్రవారం వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ నిధులు రూ.1,400 కోట్లు డ్వాక్రా సంఘాలకు జమ చేయనున్నారని తెలిపారు. మహిళా పక్షపాతిగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ మహిళా సాధికారత దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తరువాత నూతనంగా ఏర్పడిన డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం విచ్చేస్తున్న నేపథ్యంలో కోనసీమవాసులు స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, పార్టీ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్, సంసాని నాని, మట్టపర్తి నాగేంద్ర, పినిపే శ్రీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్ పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్నకు విరాళాలు



దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి గురువారం భారీగా విరాళాలు అందాయి. నిత్యాన్నదాన భవన నిర్మాణానికి పి.సర్వేశ్వరరావు, దుర్గా విజయలక్ష్మి దంపతులు (చాగల్లు మండలం చిక్కాల) రూ.40,116, నిత్యాన్నదాన పథకానికి పి.సత్యకృష్ణ, శశి ఆమని (కాకినాడ) రూ.28 వేలు, ఎస్.ఆదినారాయణ, మంగాదేవి దంపతులు (వాడపల్లి) రూ.20,116, ఎం.సత్యనారాయణ, ధనలక్ష్మి దంపతులు (రాజమహేంద్రవరం) రూ.10,116, జె.అనిరుథ్ (బెంగళూరు) రూ.10,116, ఆర్.శ్రీకాంత్, రమ్య దంపతులు (పాలకొల్లు) రూ.10,116, టి.వీర వెంకట పృథ్వీకృష్ణ, లలిత దంపతులు (విజయవాడ) రూ.10,116, ఎస్.సత్యనారాయణరెడ్డి, దామని సుభవనిరెడ్డి (రావులపాలెం) రూ.10,011, డీవీవీ సత్యనారాయణ, సత్యవతి దంపతులు (కాకినాడ) రూ.10 వేలు, వి.సత్యనారాయణ, విమల దంపతులు (రాజమహేంద్రవరం) రూ.10 వేలు, జి.భువనేశ్వర్ మణికంఠ (హైదరాబాద్) రూ.10 వేలు విరాళాలు సమర్పించారు. ఈ వివరాలను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతలకు ఆలయ కమిటీ సభ్యుల చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటం అందజేశారు.

చివరిరోజు జోరుగా నామినేషన్లు

తాళ్లరేవు: జార్జిపేట సర్పంచ్ ఉపఎన్నిక కోసం గురువారం ఐదు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి విద్యాసాగర్‌కుమార్ తెలిపారు. రెడ్డి భాగ్యలక్ష్మి, గుత్తుల సత్యవేణి, సాధనపూడి దుర్గాభవాని, కడలి భాగ్య సూర్యకుమారి, కానూరి సూర్యావతిలు తమ నామినేషన్లను అందజేశారన్నారు.

11వ వార్డు ఏకగ్రీవం

పంచాయతీ ఉప ఎన్నికల్లో భాగంగా తాళ్లరేవు గ్రామ పంచాయతీ 11వ వార్డుకు సంబంధించి ఒకే ఒక నామినేషన్ దాఖలైంది. ఈ స్థానానికి రత్సవారిపేటకు చెందిన రత్స రాజు ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవమైనట్లే. అలాగే నీలపల్లి గ్రామ పంచాయతీ 2వ వార్డుకు కుడుపూడి కుమారి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఈ పంచాయతీలో ఇద్దరు వార్డు సభ్యులు నామినేషన్లను దాఖలు చేసినట్లయ్యింది.

13న ఆర్యవైశ్య మహాసభ కమిటీ ప్రమాణస్వీకారం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘు నాయకులు

కొవ్వూరు: స్థానిక పరిమి రామారాయుడు,రత్తమ్మ కళ్యాణ మండపంలో ఈనెల 13న రాష్ట్ర, జిల్లా ఆర్యవైశ్య మహాసభ కొత్త కమిటీల ప్రమాణస్వీకారం కార్యక్రమం జరగనుంది. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు గురువారం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఈ విషయం తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడిగా కొనా శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, గ్లోబల్ చైర్మన్ టంగుటూరి రామకృష్ణ,రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఆర్యవైవైశ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు. పట్టణ సంఘం కార్యదర్శి నాళం వీరవెంకట శ్రీనివాసరావు,మట్టే ప్రసాద్,మన్య బులిబాబు, సత్యవరపు చంద్రశేఖర్,వలివేటి ప్రసాద్,చక్కా శ్రీనివాసరావు,గ్రంధి గౌతమ్,వంకాయల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో పరిమళించిన మానవత్వం



ఆకలితో ఉన్న ముదుసలికి తాను తెచ్చుకున్న బిస్కెట్లను స్వయంగా తినిపిస్తున్న విద్యార్థిని మహాశ్రీ

రామచంద్రపురం: వయస్సుకు చిన్నవారే కానీ.. మానవత్వంలో తమది పెద్ద మనసేనని చాటుకున్నారు ఆ చిన్నారులు. రామచంద్రపురం పట్టణం తోటవారి వీధిలో మదర్ థెరిసా విగ్రహానికి కూతవేటు దూరంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని రాజబాబు నగర్‌కు చెందిన దిగుమర్తి మహాశ్రీ, పలివెల కీర్తన, అంగర మణిలావణ్య తోటవారి వీధిలోని మున్సిపల్ హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నారు. వీరు ప్రతి రోజూ హైస్కూల్‌కు సైకిల్‌పై వెళ్తుంటారు. అదే క్రమంలో గురువారం స్కూల్‌కు వెళ్తుండగా.. దారిలో ఒకచోట ఒక ముదుసలి కనిపించింది. 'అమ్మా! నన్ను ఆస్పత్రికి తీసుకువెళ్లండి మీకు పుణ్యం ఉంటుంది' అంటూ అటుగా వెళ్తున్న వారిని అడుగుతోంది. ఆమె గోడు విన్న ఈ ముగ్గురు చిన్నారులూ చలించిపోయారు. ఆమె వద్దకు వెళ్లారు. 'మామ్మా! నీకు ఏం కావాలి?' అని అడిగారు. తనకు బాగా ఆకలేస్తోందని, తినడానికి ఏదైనా పెట్టాలని, ఒంట్లో బాగోలేదని, పక్కనే ఉన్న శ్రీధర్ గారి ఆస్పత్రికి తీసుకువెళ్లాలని ఆ ముసలమ్మ అడిగింది.

ఆమె దుస్థితికి చలించిపోయిన మహాశ్రీ.. తాను స్కూల్‌కు తీసుకువెళ్తున్న బిస్కెట్లను ఆ ముదుసలికి పెట్టింది. ఇంకా కావాలని అడిగితే తన వద్ద ఉన్న కొద్దిపాటి డబ్బులతో మరికొన్ని బిస్కెట్లు కొని తెచ్చి తనే స్వయంగా ఆ ముదుసలికి తినిపించింది. ఆమెను ఆస్పత్రికి తీసుకువెళ్దామని అటుగా వెళ్తున్న ఇద్దరు ముగ్గురు మోటార్ సైక్లిస్టులను బతిమాలినా వారు పట్టించుకోలేదు. సరికదా 'మీరు స్కూల్‌కు వెళ్లండి.. లేదంటే ఆబ్సెంట్ వేస్తారు' అంటూ ఓ ఉచిత సలహా చెప్పి వెళ్లిపోయారు. తమకు ఆబ్సెంట్ వేసినా ఫర్వాలేదని ఆ ముగ్గురు విద్యార్థినులూ బదులు చెప్పారు. ఇద్దరు అక్కడ ఉండి, తమ బంధువులను పిలుచుకు వచ్చి, ఆ ముదుసలిని ఆస్పత్రికి తరలించి, ఆమె బంధువులకు అప్పగించారు. చివరకు గంట ఆలస్యంగా స్కూల్‌కు వెళ్లారు. ఎందుకు ఆలస్యమైందని హెచ్‌ఎం ఎ.వెంకటాచార్యులు ప్రశ్నించగా.. ఆ ముగ్గురు విద్యార్థినులు జరిగింది చెప్పారు. వారిని హెచ్‌ఎంతో పాటు టీచర్ బి.విజయశ్రీ, తోటి విద్యార్థులు అభినందించారు.

దరియాలతిప్ప రైతుల ఆందోళన

యానాం: స్థానిక నియోజకవర్గంలోని దరియాలతిప్ప ఆయకట్టు పరిధిలో సాగు నీరందక నారుమడులు ఎండిపోతున్నాయంటూ పలువురు రైతులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. పీడబ్ల్యూడీ శాఖ ఇంజినీర్లు సాగునీరిచ్చి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. పిల్లంక పరిధిలోని బ్రహ్మపురి నుంచి ఫ్రెంచి కెనాల్ మీదుగా రావాల్సిన సాగునీరు, పత్తిగొంది నుంచి వేసిన ఫ్రెంచి కెనాల్ నుంచి సైతం సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌కు సైతం వినతి పత్రం అందించినట్లు రైతు సబ్బతి లోకేశ్వరరావు తెలిపారు.

లింక్ రోడ్ నిర్మాణానికి అనుమతి

అన్నవరం: రత్నగిరిపై వాహనాల ట్రాఫిక్ నియంత్రించేందుకు పాత సీఆర్వో కార్యాలయం వెనుక నుంచి రెండో ఘాట్‌రోడ్ మూడో మలుపు వరకు రూ.1.40 కోట్లువ్యయంతో 400 మీటర్లు పొడవునా బీటీ రోడ్ వేయనున్నారు. ఇందుకు దేవదాయశాఖ కమిషనర్ పరిపాలనా అనుమతి ఇచ్చినట్లు దేవస్థానం ఈఓ చంద్రశేఖర అజాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే ఈ రోడ్డు వేసేందుకు 30 అడుగుల వెడల్పున కొండ ప్రాంతాన్ని చదును చేసినట్లు తెలిపారు. రూ.1.40 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మించేందుకు గత నెల 28న దేవస్థానం ధర్మకర్తల మండలి తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు.

సర్కారు బడుల్లో 'పేరెంట్ టీచర్స్' సమావేశాలు



రాయవరం మండలం లొల్లలో పేరెంట్స్, టీచర్ కమిటీ సమావేశాలకు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

రాయవరం: పాఠశాలల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా పేరెంట్స్ టీచర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి పాఠశాలల్లో విద్యార్థులకు ఫార్మేటివ్, సమ్మేటివ్–1 పరీక్షలు నిర్వహించిన నేపథ్యంలో విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించేందుకు ఈ సమావేశాలను ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా 1,572 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఈ సమావేశాలను నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాలను డీవైఈవో, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు పర్యవేక్షించారు. ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన నిర్వహించిన సమావేశాల్లో పేరెంట్స్ కమిటీ సభ్యులతో పాటుగా విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రధానంగా పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల హాజరు, విద్యార్థుల విద్యాభివృద్ధి, పరీక్షల్లో వారు సాధించిన ప్రగతి, పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం తదితర అంశాలను తల్లిదండ్రులతో చర్చించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందజేశారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం నిర్వహించిన పేరెంట్స్ టీచర్ కమిటీ సమావేశాలకు అధిక సంఖ్యలో తల్లిదండ్రులు హాజరు కావడం విద్యాశాఖ వర్గాల్లో సంతోషాన్ని నింపింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కమిటీ సమావేశంలోని అంశాలను మినిట్స్ రూపంలో పొందుపర్చారు.

నులి పురుగులను నివారిద్దాం



విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి తదితరులు



విలసవిల్లిలో నులి పురుగుల నివారణ మాత్రలు అందిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి



కేశనకుర్రులో పిల్లలకు మాత్రలు వేస్తున్న వైద్యులు ఆదిత్య పవన్

- అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి
- ఘనంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

అమలాపురం టౌన్: నులి పురుగుల వల్ల విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటుందని, అందుకే ఆల్బెండజోల్ మాత్రలతో నులి పురుగులను నివారిద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. గురువారం స్థానిక నారాయణపేటలోని లాల్ బహదూర్ శాస్త్రి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆమె ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి ప్రసంగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోలిశెట్టి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

ఉప్పలగుప్తం: పిల్లలలో వచ్చే నులి పురుగులు నివారించడానికి అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని విలసవిల్లి పాఠశాలల్లో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అల్లవరం: జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా గోడిలంక పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశామని వైద్యాధికారులు సుమ, స్పందన తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని 5,958 మందితో మాత్రలను మింగించామన్నారు. బోడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలను పిల్లలకు మింగించారు.

ఐ.పోలవరం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కేశనకుర్రు, జి.వేమవరం పీహెచ్‌సీ వైద్యులు టి.ఆదిత్య పవన్, ఇందిరాశ్రీలు స్థానిక పాఠశాలల్లో పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

ఈఎస్ఐ కార్పొరేషన్ ద్వారా వైద్యసేవలు



ఎంపీ విజయసాయిరెడ్డిని కలిసిన ఎంపీ వంగా గీత

కాకినాడ: వంద పడకల ఈఎస్ఐ ఆస్పత్రికి ఈఎస్ఐ కార్పొరేషన్ ద్వారా వైద్యసేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని ఎంపీ వంగా గీత చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం సాయంత్రం ఆమె విలేకర్లకు వెల్లడించారు. త్వరలోనే నిర్మాణం పూర్తి చేసుకోనున్న ఈ ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్, ఇతర సౌకర్యాల కోసం ఇప్పటికే రూ.15 కోట్లు అదనంగా మంజూరు చేసిందన్నారు. సెప్టెంబర్ చివరికల్లా కార్మికులకు వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరినట్టు చెప్పారు. వైద్యులు, సిబ్బంది నియామకం, అవసరమైన మందులు, నిర్వహణ ఎలాంటి అంతరాయం లేకుండా కార్మికులకు నిరంతర వైద్యసేవల బాధ్యతను ఈఎస్ఐ కార్పొరేషన్ చేపట్టాల్సిందిగా కేంద్ర కార్మికశాఖామంత్రి భూపేంద్రయాదవ్‌ను కోరామన్నారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర కార్మికశాఖ, ఈఎస్ఐసీ త్వరితగతిన జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు జరగడంతో కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించిందన్నారు. ఇందుకు అన్ని విధాలా తోడ్పాటునందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్రమంత్రి భూపతియాదవ్, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

ప్రసాద్ స్కీమ్ కోసం సహకరించండి

అన్నవరం ప్రసాద్ స్కీం అమలుకు జీవో త్వరగా విడుదలయ్యేలా సహకరించాలని ఎంపీ వంగా గీత వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ నేత, టూరిజం శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ విజయసాయిరెడ్డిని కోరారు. గురువారం ఆమె ఢిల్లీలో విజయసాయిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి ఇందుకు సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు చెప్పారు. అలాగే లోక్‌సభలో వైఎస్సార్ సీపీ నేత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మిధున్‌రెడ్డిని కూడా ఆమె కలసి ధన్యవాదాలు చెప్పారు.